క్లుప్తంగా

వెంకన్నకు పంచామృతాభిషేకాలు



పెందుర్తి: వేంకటాద్రి పై కొలువైన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు స్వామివారికి సుప్రభాతసేవ అనంతరం విశేష పంచామృతాభిషేకం, క్షీరాభిషేకం చేశారు. స్వామివారికి విశేష పూజలు జరిపి, భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.

శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయం



అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ భాస్కరరావు

పెందుర్తి: శాంతి భద్రతల పరిరక్షణకు పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నట్లు సబ్ ఇన్‌స్పెక్టర్ భాస్కరరావు తెలిపారు. సీఐ కె.వి. సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు పెందుర్తి కూడలి వద్ద విజిబుల్ పోలీసింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ మహిళలు శక్తి యాప్‌ను వినియోగించుకోవాలని చెప్పారు. మత్తు పదార్థాల వాడకం వల్ల యువత జీవితాలు నాశనం అవుతాయన్నారు. ఇటీవల జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని హెచ్చరించారు. నేరాల నియంత్రణలో ప్రజల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. పలు అంశాలపై మహిళలు, విద్యార్థులకు అవగాహన కల్పించారు.

విష జ్వరాలపై అప్రమత్తం



జ్వర బాధితుల నుంచి రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: మండలంలో ప్రబలుతున్న విష జ్వరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించామని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయశ్రీ కరిష్మా అన్నారు. భరణికం పంచాయతీ కట్టవానిపాలెంలో శుక్రవారం ఫీవర్ సర్వే నిర్వహించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి జ్వరాలపై ఆరా తీశారు. దీర్ఘకాలికంగా జ్వరాలతో బాధపడుతున్న వారి నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సచివాలయ సిబ్బందికి సూచించారు. ప్రజలు కూడా పరిసరాలు శుభ్రంగా ఉంచుకుని దోమల నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పోలిరెడ్డిపాలెంలో రోడ్డు పనులకు శ్రీకారం



రోడ్డు పనులకు శ్రీకారం చుడుతున్న సర్పంచ్ లక్ష్మి

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి పంచాయతీ పోలిరెడ్డిపాలెంలో ఎన్టీపీసీ సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సర్పంచ్ శివలంక లక్ష్మి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రూ.5 లక్షల సీఎస్‌ఆర్ నిధులతో ఈ పనులు చేపడుతున్నట్లు చెప్పారు. వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

'సింగంపల్లి'కి డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న సింగంపల్లి వెంకటరావు

సబ్బవరం: ఉత్తరాంధ్రలో రెండు దశాబ్దాలుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సబ్బవరంలోని శ్రీబంగారు తల్లి సేవా సమితి వ్యవస్థాపకుడు సింగంపల్లి వెంకటరావును డాక్టరేట్ వరించింది. అమెరికాలోని టెక్సాస్‌లో గల డే స్ప్రింగ్ దెయోలాజికల్ యూనివర్సిటీ వెంకటరావుకు హైదరాబాద్‌లోని అబిడ్స్ సూర్యా లాక్ కాంప్లెక్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో శుక్రవారం గౌరవ డాక్టరేట్‌ను అందజేశారు. రక్తం అందకపోవడంతో ఎవరూ మరణించకూడదనే గొప్ప ఆశయంతో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి ఎందరి ప్రాణాలో కాపడటంతో పాటు అన్నదానాల వంటి సేవా కార్యక్రమాలు చేపట్టడంతో వెంకటరావు సేవలను గుర్తించి డాక్టరేట్‌కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న యూనివర్సిటీ ప్రతినిధులు, ఆకాడమీ చైర్మన్ గాడ్స్ సన్ హోలీ స్పిరిట్, వైస్ చైర్మన్ వరప్రసాద్, రెహమాన్, ఇజ్రాయిల్ నగరానికి చెందిన ప్రముఖులు, జబర్దస్త్ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలే మేలు

- పాడి పశువులకు సోకే అంటు వ్యాధులకు టీకాలతో చెక్
- చురుగ్గా సాగుతున్న థైలేరియా, లంపీ స్కిన్ టీకాల కార్యక్రమం
- వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న పశుసంవర్ధక శాఖ





పాడి పశువులకు థైలేరియా టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది, (ఇన్‌సెట్) టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టినాయుడు



లంపీ స్కిన్ టీకా

సబ్బవరం: రైతులు వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమను కూడా అభివృద్ధి చేసుకుని మెరుగైన జీవన ప్రమాణంతో ముందుకు సాగుతున్నారు. మేలైన పశుగ్రాసం వినియోగించడం ద్వారా అధిక పాల దిగుబడి సాధిస్తున్నారు. పశువులకు సీజనల్‌గా సోకే థైలేరియా, లంపీ స్కిన్ (ముద్ద చర్మం) వ్యాధులను నియంత్రించేందుకు పశు సంవర్ధక శాఖ ప్రతి గ్రామంలో ఉచిత టీకాల కార్యక్రమం చేపడుతోంది.

ముమ్మరంగా టీకాల కార్యక్రమం..

పాడి పశువులలో వచ్చే థైలేరియా వ్యాధి నివారణకు పశు సంవర్ధక శాఖ ఉచిత టీకాల కార్యక్రమం చేపట్టింది. ఇది ప్రధానంగా సంకరజాతి పశువులలో సోకుతుంది. నెల రోజుల పాటు నిర్వహించనున్న ఈ ఉచిత టీకాల కార్యక్రమానికి మండలంలో 5400 డోస్‌లు అందుబాటులో ఉంచారు. పాడి రైతులందరూ తమ వద్ద ఉన్న మూడు నెలలు నిండిన ఆడ, మగ సంకరజాతి పశువులకు ఈ టీకాలను విధిగా వేయించుకోవాలి. ప్రతి గ్రామంలో నిర్వహించే శిబిరంలో రూ.850 విలువ చేసే టీకాలను ఉచితంగా పశువులకు వేస్తారు. ఇప్పటికే 5,083 పశువులకు టీకాలు వేశారు.

వ్యాధి కారకాలు.. వాటి లక్షణాలు..

- థైలేరియా వ్యాధి సంకరజాతి పశువుల్లో గోమారు, పిరుదులు కుట్టడం వల్ల వస్తుంది.

మండంలోని పాడి పోషణ ఇలా..

గ్రామ పంచాయితీలు	: 24
ఆవులు	: 10,473
గేదెలు	: 6,779
గొర్రెలు	: 3,890
మేకలు	: 5,905
ఫారం కోళ్లు	: 9,23,026

- విపరీతమైన జ్వరంతో సరిగా మేత మేయకపోవడం, దవడల కింద గగ్గల వాపు, నీరసించిపోవడం వంటి లక్షణాలు పశువుల్లో కనిపిస్తాయి.
- చూడి కట్టిన పశువులకు గర్భస్రావం జరగవచ్చు.
- ఈ వ్యాధి సోకిన పశువుల్లో 90 శాతం పశువులు వైద్యం అందించినప్పటికీ మృత్యువాత పడతాయి.
- మండలంలోని అన్ని గ్రామాల్లో గత నెల 25 నుండి ఈ నెల 15వ తేదీ వరకూ లంపీ స్కిన్ వ్యాధికి టీకాల కార్యక్రమం నిర్వహించనున్నారు. గత రెండు మూడేళ్ల నుండి ఈ వ్యాధి మన రాష్ట్రంలోని పశువులకు సోకుతోంది. మండలంలో పాడి పశువులకు 6,600 డోసులు సిద్ధంగా ఉంచగా ఇప్పటి వరకూ 1,468 పశువులకు టీకాలు వేశారు.
- పాడి రైతులు వ్యాధి సోకిన పశువులను కడగరాదని, మిగిలిన పశువుల నుండి వాటిని వేరుగా ఉంచాలని పశు వైద్య సిబ్బంది చెబుతున్నారు. పశువులకు దద్దుర్లు రావడం, జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని పశు వైద్యాధికారులను సంప్రదించాలని స్పష్టం చేస్తున్నారు.

పశువులకు టీకాలు వేయించాలి..



పాడి పశువులలో సోకే థైలేరియా, లంపీ స్కిన్ వ్యాధులను పూర్తిగా నియంత్రించేందుకు పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఉచిత టీకాలు వేస్తున్నాం. ఈ అవకాశాన్ని పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలి. పాడి పశువులకు ఈ టీకాలు వేయడం ద్వారా మిగిలిన పశువులకు వ్యాధి సోకకుండా నియంత్రించవచ్చు.

– డాక్టర్ చిట్టినాయుడు, ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు, సబ్బవరం

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపం వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణాన్ని నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

సెప్టెంబర్ 5న న్యాయ విశ్వవిద్యాలయం స్నాతకోత్సవం

సబ్బవరం: దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం 8,10,11,12వ స్నాతకోత్సవం వచ్చే నెల 5వ తేదీన విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్నట్లు విశ్వ విద్యాలయ ఉప కులపతి ఆచార్య డి. సూర్యప్రకాశరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సంవత్సరాలలో కోర్సు పూర్తి చేసిన వారందరూ స్నాతకోత్సవంలో డిగ్రీలు అందుకునేందుకు ఈ నెల 23వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఇతర వివరాలకు విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో చూడవచ్చని తెలిపారు.

దారి దోపిడీ అంటూ వ్యక్తి ఫిర్యాదు





ఘటనాస్థలిలో విచారిస్తున్న క్రైం ఎస్‌ఐ సూరిబాబు, తీవ్ర గాయాలతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న శ్రీను

- మద్యం మత్తులో బైక్‌పై నుంచి పడిపోయాడని విచారణలో వెల్లడి
- తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వైనం

పెందుర్తి: తాను అర్ధరాత్రి వస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేసి నగదు దోచుకుపోయినట్లు వేపగుంట అప్పలనర్శయ్య కాలనీకి చెందిన ఓ వ్యక్తి పెందుర్తి క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తీవ్ర గాయాలతో ప్రస్తుతం అతడు కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనపై ఎస్‌ఐ డి.సూరిబాబు ఆధ్వర్యంలో క్రైం బృందం శుక్రవారం సమగ్ర విచారణ చేపట్టారు. వివరాలివి.. కాలనీకి చెందిన బైక్ మెకానిక్ దయ్యాల శ్రీను (35) గురువారం అర్ధరాత్రి బయటికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్నాడు. ఆ సమయంలో నాయుడుతోట సంతోషిమాత ఆలయం వద్ద గుర్తు తెలియని వ్యక్తులు తనపై దాడి చేసి బైక్, సెల్‌ఫోన్, జేబులో నగదు ఎత్తుకుపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తిరిగి బైక్, సెల్‌ఫోన్ ఇచ్చేశారని పోలీసుల విచారణ చెబుతున్నాడు. దీనిపై శుక్రవారం పోలీసులు సమగ్ర విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారుడు శ్రీను మద్యం మత్తులో బైక్‌పై నుంచి పడిపోయినట్లు ప్రాథమికంగా గుర్తించారు. తన వద్ద దుండగులు దోచుకుపోయిన నగదు తన యజమాని ఇచ్చినట్లు పోలీసులుకు చెబుతున్నాడు. అయితే పోలీసుల విచారణలో అతడికి నగదు ఇవ్వలేదని యజమాని చెప్పారు. ఈ క్రమంలో దోపిడీ జరిగిందా లేదా అన్న అంశంపై లోతుగా విచారిస్తున్నట్లు ఎస్‌ఐ సూరిబాబు వెల్లడించారు.

తుంగభద్ర వారియర్స్ జెర్సీ ఆవిష్కరణ



కొత్త జెర్సీతో తుంగభద్ర వారియర్స్

దాబాగార్డెన్స్: ఏపీఎల్ సీజన్-4లో ఆడనున్న 'తుంగభద్ర వారియర్స్' క్రికెట్ టీం జెర్సీని శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తుంగభద్ర వారియర్స్ ప్రతినిధి శేషుకుమార్ మాట్లాడుతూ తుంగభద్ర టీం అనేది ఏపీఎల్‌లో ఆడే ఓ జట్టని, శేషుకుమార్, సిద్ధార్థ మురకొండ లీడ్ చేస్తున్నారని, స్థానిక క్రీడాకారులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ టీం ఆడుతుందన్నారు. ఈ నెల 23 వరకు 7 టీమ్‌లతో ఆడనుందని చెప్పారు. కార్యక్రమంలో కోచ్ ఏజీ ప్రదీప్, కెప్టెన్ మహీప్‌కుమార్, శేషుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మసకబారిన దువ్వాడ నేమ్ బోర్డు



డిజిటల్ అక్షరాలు వెలగని దువ్వాడ రైల్వేస్టేషన్ బోర్డు

అగనంపూడి: దువ్వాడ రైల్వేస్టేషన్ నాలుగోప్లాట్ ఫారం వైపు డిజిటల్ బోర్డులో అక్షరాలు మసకబారాయి. తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో ప్రధాన ద్వారం ఎలివేషన్‌లో నేమ్ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే రాత్రి వేళల్లో కనపడడం కోసం డిజిటల్ బోర్డ్ ఏర్పాటు చేశారు. అయితే వాటిలో సగం బోర్డులో దీపాలు వెలగకపోవడంతో అక్షరాలు సగం సగం వెలుగుతుండడంతో నేమ్ బోర్డు మసకబారింది.

డాక్ యార్డ్ కేటీబీ నూతన కార్యవర్గం ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

విశాఖ విద్య: డాక్ యార్డ్ కేటీబీ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని శుక్రవారం సభ్యుల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడిగా గంట్ల శ్రీనుబాబు, అధ్యక్ష, కార్యదర్శులుగా బత్తుల చిరంజీవి, విజనగిరి భాస్కరరావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా విరోతి వెంకటేష్, అడిషనల్ జనరల్ సెక్రటరీగా యాతము రాజ్ కుమార్, కోశాధికారిగా గనిరెడ్డి శ్రీనివాస్‌తో కలిపి మొత్తం 27 మంది నూతన కార్యవర్గంలో ఎన్నికయ్యారు. సంఘ గౌరవ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు అధ్యక్షతన ఎస్‌ఏడీ సమీపంలోని కాకానినగర్‌లోని సంఘ కార్యాలయంలో కార్యవర్గ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం తొలిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌరవ అధ్యక్షుడు శ్రీనుబాబు,అధ్యక్షుడు బత్తుల చిరంజీవి మాట్లాడుతూ రక్షణ రంగంలో సేవ చేసే అవకాశం లభించడం ప్రతి ఒక్కరూ పూర్వ జన్మసుకృతంగా భావించాలన్నారు. అందరి సహకారంతో కేటీబీ కళాక్షేత్రాన్ని నిర్మించి అందుబాటులోకి తెచ్చుకోగలిగామన్నారు. అధికారుల, ఉద్యోగుల సంక్షేమానికి (సభ్యుల) తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గం పలు తీర్మానాలు చేసింది. మూడేళ్ల పాటు ఈ కార్యవర్గం కొనసాగుతుంది. పలువురి సీనియర్లను సలహాదారులుగా, కొందరు న్యాయవాదులను ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించుకోవాలని నిర్ణయం తీసుకున్నారు. నూతన కార్యవర్గానికి సభ్యులంతా అభినందనలు తెలియజేశారు.

వైభవంగా వరలక్ష్మి పూజలు



గాజుల అలంకరణలో పూజలందుకున్న ఎస్ఆర్ పురం కనకదుర్గమ్మ



సప్తగిరినగర్‌లో పూజలందుకున్న అలివేలు మంగమ్మ



విశేషాలంకరణలో సాధూమఠం సంతోషిమాత



మహాలక్ష్మి అవతారంలో పూజలందుకున్న సుజాతానగర్ కనకదుర్గమ్మ



తిరువీధిలో అమ్మవార్ల ఉత్సవ మూర్తులు



వేంకటేశ్వరస్వామి ఆలయంలో కొలువు దీరిన లక్ష్మీదేవి అమ్మవారు



విజినిగిరిపాలెంలో కొలువు దీరిన ఉమాదేవి అమ్మవారు



దేవీపురంలో మహాలక్ష్మికి అభిషేకం చేస్తున్న మహిళలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

- భక్తులతో కిటకిటలాడిన అమ్మవార్ల ఆలయాలు

పెందుర్తి: వరలక్ష్మి పూజలతో పెందుర్తి ఆధ్యాత్మిక చింతనలో పరవశించింది. శ్రావణలక్ష్మి నామస్మరణతో మార్మోగింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు పట్టణంలోని అమ్మవార్ల దేవాలయాలు కిటకిటలాడాయి. చినముషిడివాడ దరి అలివేలు మంగమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేషాలంకరణ చేశారు. అనంతరం సామూహిక కుంకుమ పూజలు జరిపారు. విష్ణు సహస్ర నామార్చన, లక్ష్మీ సహస్ర నామార్చన చేశారు.

- ఎస్ఆర్ పురంలో కొలువుదీరిన కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు జరిపారు. అమ్మవారు గాజుల అలంకరణలో దర్శనమిచ్చారు. సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ ధర్మకర్త కాయిత ఎర్రిబాబు ఆధ్వర్యంలో ప్రసాద వితరణ చేపట్టారు.
- సుజాతానగర్‌లోని అయ్యప్పస్వామి దేవాయల ప్రాంగణంలోని కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. మహాలక్ష్మిగా అమ్మవారు పూజలందుకున్నారు. సామూహిక కుంకుమ పూజలు జరిపారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
- శ్రమశక్తినగర్‌లోని పంచముఖ గాయత్రీ మాత ఆలయంలో కుంకుమ పూజలు చేశారు. వందలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.
- సాధూమఠం సంతోషిమాత ఆలయంలో అమ్మవారికి అభిషేకాలు జరిపారు. ఆలయ ప్రధాన అర్చకులు మురళీకృష్ణశర్మ, ఉపేంద్రశర్మ ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి.
- పెందుర్తి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు ప్రసాద వితరణ చేపట్టారు.
- పెందుర్తిలోని మహా కామేశ్వరీ ఆలయంలో ఘనంగా పూజలు నిర్వహించారు. మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలో భారీ ఎత్తున సామూహిక కుంకుమ పూజలు జరిపారు.

సింహగిరిపై సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన..

సింహాచలం: వరలక్ష్మీ వ్రతాన్ని పురస్కరించుకుని సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో వేంజేసిన సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన విశేషంగా నిర్వహించారు. సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో వేదికపై అధిష్టింపజేసి ఈ పూజ నిర్వహించారు. లక్ష నామాలతో అమ్మవార్లకు కుంకుమపూజ నిర్వహించి హారతి అందజేశారు. పూజలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, కుంకుమ ప్రసాదం అందజేశారు. సాయంత్రం అమ్మవారికి ఆలయ బేడా మండపంలో పెద్ద ఎత్తున తిరువీధి నిర్వహించారు. అమ్మవారికి సహస్ర నామార్చన పూజ ఘనంగా నిర్వహించారు. దేవస్థానం ఈవో వి.త్రినాథరావు దంపతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వరలక్ష్మీ నమోస్తుతే..

శ్రావణ శుక్రవారం సందర్భంగా సింహాచలం దేవస్థానానికి చెందిన కొండ దిగువ వేంకటేశ్వర స్వామి ఆలయంలో లక్ష్మీదేవి అమ్మవారికి విశేషంగా కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవమూర్తిని అధిష్టింపజేశారు. భక్తుల గోత్రనామాలతో అష్టోత్తర పూజ నిర్వహించారు. స్వామి వారికి విశేషంగా హారతి అందజేశారు.

- అడవివరంలోని విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన ఉమాదేవికి శ్రావణ శుక్రవారం పూజలు విశేషంగా నిర్వహించారు. అమ్మవారిని పలు రకాల పుష్పాలు, కుంకుమతో పూజించారు. భక్తులు, గ్రామస్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు ఉదయ్‌కృష్ణ శర్మ ఈ కార్యక్రమాలు నిర్వహించారు.

దేవీపురంలో..

సబ్బవరం: దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవి క్షేత్రంలో కొలువైన మహాలక్ష్మి అమ్మవారికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామావళితో కుంకుమార్చనలు నిర్వహించారు. అమృత కన్యా గురుకుల విద్యార్థినుల మంత్రపఠనం ఆకట్టుకుంది. ముగ్గురు అమ్మల ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రజత కవచ వరలక్ష్మీ అమ్మవారి భక్తులకు గురుమాత అన్నపూర్ణమ్మ ఆశీర్వదించి మంత్రీకరించిన శ్రీయంత్ర రూపులు, గాజులు, పసుపు, కుంకుమ, రవికలు అందజేశారు. యాగశాలలో శ్రీవిద్యారణ్య సంపుటిత శ్రీసూక్త హోమం జరిగింది.

రైలు ప్రమాదంలో గాయపడిన విష్ణుయాదవ్ డిశ్చార్జి



రోగిని పరామర్శిస్తున్న డాక్టర్ రాధాకృష్ణన్ తదితరులు

మహారాణిపేట: కదులుతున్న రైలు నుంచి ప్రమాదశాత్తు జారి పడి తీవ్రంగా గాయపడ్డ విష్ణుయాదవ్ (26)ను వైద్య సేవలు అందించి శుక్రవారం కేజీహెచ్ వైద్యులు డిశ్చార్జి చేశారు. గత నెల 27న కరకవలస వద్ద కదులుతున్న రైలు నుంచి విష్ణుయాదవ్ జారి పడి తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలో అతని ఎడమ చేయి భుజం వరకు తెగి శరీరం నుంచి వేరు పడింది. స్పృహ లేని స్థితిలో ఉన్న యాదవ్‌ను కేజీహెచ్ అత్యవసర విభాగంలో చేర్పించారు. షాక్ నుంచి కోలుకోవడానికి వైద్య సేవలు అందించి, అనంతరం రక్తం ఎక్కించి శస్త్ర చికిత్స నిర్వహించారు. మత్తు, ఆర్థోపెడిక్, ప్లాస్టిక్ సర్జరీ విభాగాలు సంయుక్తంగా శస్త్ర చికిత్స చేసి రోగి త్వరగా కోలుకునే విధంగా వైద్య సేవలు అందించారు. శుక్రవారం కేజీహెచ్ డిప్యూటీ సూపరిండెంటెండ్ డాక్టర్ రాధాకృష్ణన్ రోగిని పరామర్శించారు. విష్ణుయాదవ్ ఆరోగ్యంగా ఉండడంతో శుక్రవారం డిశ్చార్జి చేసినట్టు సూపరింటెండెంట్ డాక్టర్ ఐ.వాణి తెలిపారు. రోగి, వారి బంధువులు వైద్యులకు ధన్యవాదాలు తెలిపారు.